


ఫాస్టాగ్‌కూ ఈ-కేవైసీ!

PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd




పట్టాలు కోల్పోయిన పేదలకు న్యాయం చేస్తా

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 01 సంచిక - 28 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 06 రూ - 03/- ఆదివారం 28 జనవరి 2024

# త్వరలో కుల గణన

**నియోజకవర్గానికో ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్**

**గురుకులాల సొంత భవనాలకు స్థలాల గుర్తింపు**

**గ్రీన్ ఛానల్ ద్వారా డైట్, కాస్మోటిక్ ఛార్జీల చెల్లింపు**

**విదేశాలకు వెళ్లే విద్యార్థులకు మరింత ప్రయోజనం**


**బిసి, ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ విభాగాల సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



**పిసిడబ్ల్యూ న్యూస్/హైదరాబాద్ :** త్వరలోనే రాష్ట్రంలో కుల గణన చేపడుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం తమ ప్రభుత్వం ఈ నిర్ణయానికి కట్టుబడి ఉందని తెలిపారు. కుల గణనకు అవసరమైన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం సచివాలయంలో బిసి, మైనారిటీ, గిరిజన సంక్షేమ విభాగాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో బిసి కుల గణనపై సుదీర్ఘ చర్చ జరిగింది. బిసి కుల గణన నిర్వహించి జనాభా దామాషా ప్రకారం బిసిలకు రిజర్వేషన్లు పెంచాలని బిసి సంఘాలు చాలా కాలంగా ఉద్యమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొన్ని రాష్ట్రాల్లో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కులగణన నిర్వహిస్తున్నాయి. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ కులగణన చేపట్టారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో కులగణన అంశాన్ని చేర్చింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కులగణన నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు సంబంధించి తగు చర్యల నిమిత్తం సిఎం అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. రాష్ట్రంలో అద్దె భవనాల్లో ఉన్న సంక్షేమ గురుకుల పాఠశాలలకు సంబంధించి పూర్తి వివరాలను అందించాలనిముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. వీటికి సొంత భవనాలను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. యుద్ధ ప్రాతిపదికన భవనాల నిర్మాణానికి సరిపడే స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఒక్కో స్కూల్ నిర్మాణానికి ఎంత ఖర్చవుతుందో అంచనా వేసి బడ్జెట్ ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కోరారు. ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు ఇచ్చే డైట్ ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలు, వంట బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లింపులు చేయాలన్నారు.

మిగతా 2లో.

## అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు



**పిసిడబ్ల్యూ న్యూస్/హైదరాబాద్**

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దయింది. ఈ మేరకు కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి వెల్లడించారు. అత్యవసర పనుల కారణంగా అమిత్ షా పర్యటన రద్దయిందని తెలిపారు. ఆదివారం మహబూబ్ నగర్, కరీంనగర్, హైదరాబాద్‌లలో నిర్వహించాల్సిన సమావేశాలు రద్దయ్యాయి.

బీహార్ రాజకీయ పరిణామాల నేపథ్యంలో అమిత్ షా పర్యటన రద్దయినట్లుగా వార్తలు వస్తున్నాయి. బీహార్‌లో నితీశ్ కుమార్ I.N.D.I.A. కూటమికి గుడ్‌బై చెప్పి బీజేపీ వైపు అడుగులు వేస్తారనే ప్రచారం సాగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దయింది.

## 10 సీట్లు వచ్చినప్పుడే వెనకడుగు వేయలేదు..

- కాంగ్రెస్ అబద్ధాలు చెప్పి గెలిచిందన్న హరీశ్ రావు
- బీఆర్ఎస్ 1.08 ఓట్ల తేడాతో మాత్రమే ఓడిపోయిందని వెల్లడి
- లంకె బిందెలు ఉన్నాయని వస్తే ఖాళీ బిందెలు కనిపించాయన్న రేవంత్ వ్యాఖ్యలకు కౌంటర్




## సంగారెడ్డి జిల్లాలో భూప్రకంపనలు...


**న్యాల్‌కల్, ముంగి తదితర గ్రామాల్లో స్వల్పంగా కంపించిన భూమి**

**తాము వింత శబ్ధాలు విన్నట్లుగా చెప్పిన ఆయా గ్రామాల ప్రజలు**

**భూప్రకంపనల వల్ల ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదని వెల్లడి**

**పిసిడబ్ల్యూ న్యూస్/సంగారెడ్డి**

తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలో భూప్రకంపనలు చోటు చేసుకున్నాయి. న్యాల్‌కల్, ముంగి తదితర గ్రామాల్లో భూమి స్వల్పంగా కంపించడంతో ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. భూమి కంపించడంతో పాటు తాము వింత వింత శబ్దాలు విన్నామని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. అయితే భూప్రకంపనల కారణంగా ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదు. ప్రకంపనలపై అధికారులు ఆయా గ్రామాల్లో ఆరాతీస్తున్నారు.



## ఫిబ్రవరి 1న కేసీఆర్ ప్రమాణం

**అసెంబ్లీ ఎన్నికల్లో గజ్వేల్ నుంచి పోటీ చేసి గెలిచిన కేసీఆర్**

**సమీప బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌పై 45,000 మెజార్టీతో విజయం**

**కామారెడ్డి నుంచి పోటీ చేసి బీజేపీ అభ్యర్థి చేతిలో ఓడిపోయిన కేసీఆర్**



**పిసిడబ్ల్యూ న్యూస్/హైదరాబాద్ :**మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫిబ్రవరి 1వ తేదీన ఎమ్మెల్యేగా ప్రమాణం చేయనున్నారు. స్పీకర్ సమక్షంలో ఆయన ప్రమాణం చేస్తారు. గజ్వేల్ నుంచి గెలిచిన కేసీఆర్ ఆసుపత్రిలో చేరడంతో ఇప్పటి వరకు ప్రమాణ స్వీకారం చేయలేదు. కేసీఆర్ గత ఏడాది డిసెంబర్ 7వ తేదీ అర్ధరాత్రి తన ఫాంహౌస్‌లో బాత్రూంలో కాలు జారిపడ్డారు. దీంతో ఆయన కాలుకు తీవ్ర గాయమై ఆసుపత్రిలో చేరారు. ఇటీవల ఆయన కోలుకున్నారు. దీంతో త్వరలో ప్రమాణం చేయనున్నారు.గత ఏడాది చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ గజ్వేల్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిచారు. గజ్వేల్ నుంచి కేసీఆర్ వరుసగా మూడోసారి విజయం సాధించారు. ఇటీవలి ఎన్నికల్లో సమీప బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌పై 45 వేల మెజార్టీతో విజయం సాధించారు. కామారెడ్డి నుంచి కూడా పోటీ చేసినప్పటికీ బీజేపీ నుంచి కాటిపల్లి వెంకటరమణా రెడ్డి చేతిలో ఓడిపోయారు. కామారెడ్డి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పోటీ చేశారు. కానీ నాటి ముఖ్యమంత్రి అభ్యర్థులు కేసీఆర్, రేవంత్ రెడ్డిలని ఓడించి వెంకటరమణారెడ్డి జెయింట్ కిల్లర్‌గా నిలిచారు. ఎన్నికల్లో గెలిచిన వారిలో చాలామంది గత డిసెంబర్ నెలలోనే ప్రమాణం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులచే ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించిన మజ్లిస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ప్రమాణం చేయించారు. బీజేపీ ఎమ్మెల్యేలు మాత్రం గడ్డం ప్రసాద్ కుమార్ స్పీకర్ అయ్యాకే ప్రమాణం చేశారు.

## తెలంగాణలో కొత్త రేషన్ కార్డు కోసం మళ్లీ దరఖాస్తులు..

**మీసేవలో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ సూచన ఫిబ్రవరి నెలాఖరు వరకు గడువు**

**ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా మళ్లీ అప్లై చేయాల్సిందే**

**దరఖాస్తుల స్క్రూటినీ కోసం తప్పదంటూ అధికారుల వివరణ**



**పిసిడబ్ల్యూ న్యూస్/హైదరాబాద్ :**తెలంగాణలో కొత్త రేషన్ కార్డు కోసం మీసేవలో దరఖాస్తు చేసుకోవాలంటూ ప్రభుత్వం సూచించింది. ఇప్పటికే ప్రజాపాలనలో దరఖాస్తులు సమర్పించినా సరే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. స్క్రూటినీ కోసం కొత్తగా అప్లై చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రజలకు సూచిస్తున్నారు. ఇంతకు ముందు అవకాశం ఇవ్వని కేటగిరీకి చెందిన వారు కూడా తాజాగా దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. ఇందు కోసం ఫిబ్రవరి నెలాఖరు వరకు ప్రభుత్వం గడువు విధించిందని చెప్పారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే ఆరు హామీలను అమలు చేసేందుకు చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ప్రజాపాలన పేరుతో ఊరూరా సభలు ఏర్పాటు చేసి అర్హుల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. అభయహస్తం, గ్యాస్ సబ్సిడీ, ఇందిరమ్మ ఇళ్లు తదితర పథకాలతో పాటు కొత్త రేషన్ కార్డుల కోసం వైట్ పేపర్ పై దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇలా సేకరించిన దరఖాస్తులను ప్రస్తుతం ఆన్ లైన్ చేసే ప్రక్రియ కొనసాగుతోందని అధికారవర్గాల సమాచారం. ఈ నేపథ్యంలోనే కొత్త రేషన్ కార్డులకు మీసేవ ద్వారా మరోమారు దరఖాస్తులు స్వీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అప్లికేషన్లను ప్రాసెస్ చేయడానికి మీసేవ లో దరఖాస్తు చేసుకోవాలని ప్రజలకు సూచించింది.

# 10 సీట్లు వచ్చినప్పుడే వెనకడుగు వేయలేదు..

**పిసిడబ్ల్యూ న్యూస్/హైదరాబాద్ :**

మనకు 10 సీట్లు వచ్చినప్పుడు కూడా వెనకడుగు వేయలేదని... బీఆర్ఎస్ ముళ్ల బాట... పూలబాట రెండింటినీ చూసిందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. సిద్దిపేటలోని ఓ గార్డెన్‌లో ఈ రోజు ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కృతజ్ఞత సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గత అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 1.08 శాతం ఓట్ల తేడాతో మనం అధికారం కోల్పోయామని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు చెప్పి గెలిచిందని ఆరోపించారు. అధికారంలో ఉన్న వారిని ప్రశ్నిస్తే దాడులు చేస్తారా? అని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీకి ఉద్యమాలు, దాడులు, బెదిరింపులు కొత్త కాదన్నారు.తెలంగాణ ఉద్యమం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు పార్టీ ఎత్తుపల్లాలను ఎన్నింటినో చూసిందన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ, వడ్లకు రూ.5వేల బోనస్, రూ.4వేల పెన్షన్, కరెంట్ బిల్లుల



మాఫీ వంటి హామీలు ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలన్నారు. సచివాలయంలో లంకె బిందెలు ఉన్నాయని వస్తే... ఖాళీ బిందెలు కనిపిస్తున్నాయని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడంపై హరీశ్ రావు కౌంటర్ ఇచ్చారు. లంకె బిందెలు ప్రభుత్వ భవనాల్లో ఉంటాయా? లేక పాడుబడిన ఇళ్లలో ఉంటాయా? అని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్నవాళ్లకు ఓపిక ఉండాలని హితవు పలికారు. ఇచ్చిన హామీలను ఎలా ఎగ్గొట్టాలా? అని కాంగ్రెస్ ఆలోచన చేస్తోందని ఆరోపించారు. అందుకే అప్పులు.. లంకె బిందెలు అంటూ సాకులు చెబుతోందన్నారు.

మహాలక్ష్మిలో భాగంగా మహిళలకు రూ.2,500 ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి రెండో వారంలో లోక్ సభ ఎన్నికల నోటిఫికేషన్ కంటే ముందుగానే ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఒక్క ఎకరా పారడం లేదని మంత్రి కొండా సురేఖ ఆరోపించడం విడ్డూరమన్నారు. రంగనాయకసాగర్ గేట్లు ఎలా వదిలారు? అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రయోజనాలు కాపాడేది కేవలం బీఆర్ఎస్సే అన్నారు. రానున్న లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# ఉమ్మడి ప్రవేశ పరీక్షలకు కన్వీనర్లు నియామకం

**పిసిడబ్ల్యూ న్యూస్/హైదరాబాద్ :** రాష్ట్రంలో ఈ విద్యాసంవత్సరానికి ఉమ్మడి ప్రవేశ పరీక్ష తేదీలను తెలంగాణ ఉన్నత విద్యామండలి ఇటీవల ప్రకటించింది. శనివారం ఉమ్మడి ప్రవేశ పరీక్షలకు కన్వీనర్లు నియమిస్తూ ఉన్నత విద్యామండలి సెక్రటరీ శ్రీనివాస్‌రావు ప్రకటన విడుదల చేశారు. ఎప్‌సెట్ కన్వీనర్‌గా జెఎన్‌టియూ ప్రొఫెసర్ డి. డీన్ కుమార్‌కు బాధ్యతలు అప్పగించింది. పిజి ఈసెట్ కన్వీనర్‌గా జెఎన్‌టియూ ప్రొఫెసర్ అరుణ కుమారి, ఐసెట్ కన్వీనర్‌గా కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్ నర్సింహాచారి నియమించింది. ఈసెట్ కన్వీనర్‌గా ఓయూ ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్, లాసెట్, పిజి ఎల్‌సెట్ కన్వీనర్‌గా ఓయూ ప్రొఫెసర్ విజయలక్ష్మి, ఎడ్‌సెట్ కన్వీనర్‌గా ఓయూ ప్రొఫెసర్ మృణాళిని, పిఈసెట్ కన్వీనర్‌గా ఓయూ ప్రొఫెసర్ రాజేశ్‌కుమార్ నియామకమయ్యారు.

ఉమ్మడి ప్రవేశ పరీక్షలు మేలో ప్రారంభం కానున్నాయి. మే 9 నుంచి 11 వరకు ఎంసెట్ ఇంజినీరింగ్ కోర్సులకు ప్రవేశ పరీక్ష జరుగనున్నది. మే 12, 13 తేదీల్లో అగ్రికల్చర్ అండ్ ఫార్మాసీ ప్రవేశ పరీక్ష జెఎన్‌టియూ ఆధ్వర్యంలో జరుగనున్నది. ఈసెట్ ప్రవేశ పరీక్ష ఉస్మానియా యూనివర్శి టీ ఆధ్వర్యంలో జరుగనుండగా మే 6వ తేదీర పరీక్ష నిర్వహిస్తారు. బిఈడీ కోర్సులో ప్రవేశం కోసం ఉద్దేశించిన టీఎస్ ఎడ్ సెట్ పరీక్ష మే 23న జరుగనుండగా నల్గొండలోని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరుగుతుంది. టిఎస్ లా సెట్ ఎంట్రన్స్ టెస్ట్ జరుగనున్నది. జూన్ 3న ఎల్ఎల్ఎం ప్రవేవ పరీక్ష జరుగనుండగా లాసెట్, పీజీ ఎల్‌సెట్‌లను ఉస్మానియా యూనివర్శిటీ నిర్వహిస్తుంది. ఐసెట్ ప్రవేశ పరీక్ష జూన్ 4, 5 తేదీల్లో జరుగనుండగా కాకతీయ యూనివర్సిటీ నిర్వహణలో జరుగుతుంది. ఎంటెక్, ఎం ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం కోసం ఉద్దేశించిన పీజీఈసెట్ పరీక్ష జూన్ 6 నుంచి 8 తేదీల మధ్యలలో నిర్వహించనున్నారు. జెఎన్‌టియూ ఆధ్వర్యంలో ఈ కామన్ ఎంట్రెన్స్ టెస్టులు జరగనున్నాయి. బిపిఎడ్, డిపిఎడ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పిఈసెట్ పరీక్ష జూన్ 10 నుంచి 13వ తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ ప్రవేశ పరీక్షను శాతవాహన యూనివర్శిటీ నిర్వహిస్తుంది.

# ఫాస్టాగ్‌కూ ఈ-కేవైసీ!

## మిగిలింది నాలుగు రోజులే

**పిసిడబ్ల్యూ న్యూస్/హైదరాబాద్ :** ఎల్పీజీ కనెక్షన్ కు కేవైసీ.. రేషన్ కార్డకు కేవైసీ.. బ్యాంక్ అకౌంట్ కు కేవైసీ.. పాన్ కు కూడా కేవైసీ.. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా సర్వీసులకు ఇప్పటి వరకు కేవైసీ చేయించుకోవాలని ఆయా సంస్థలు ప్రకటించాయి. వాటిని పూర్తి చేసేందుకు లైన్లలో నిలబడటం, తిప్పలు పడటం ఇప్పటి వరకు జరిగాయి. ఇక ఇప్పుడు ఫాస్టాగ్ కు కూడా వినియోగదారులు ఈ ప్రక్రియ పూర్తి చేసుకోవాల్సి ఉంటుది. ఫాస్టాగ్ డీయాక్టివేట్ కాకుండా ఉండేందుకు




వినియోగదారులు వివరాలను అప్డేట్ చేయాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్ హెచ్ఏఐ) తెలిపింది. 2024 జనవరి 31 తర్వాత అసంపూర్తిగా ఉన్న కేవైసీ ఉన్న ఫాస్టాగ్ లను డీయాక్టివేట్ చేస్తామని హెచ్చరించింది. ఈ మేరకు ఆ సంస్థ ఓ ప్రకటన విడుదల చేసింది.

ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచడానికి, టోల్ ప్లాజాల వద్ద అంతరాయం లేకుండా సేవలు అందించేందుకు ఈ చర్య తీసుకున్నట్లు హైవే అథారిటీ పేర్కొంది. పలు వాహనాలకు ఒకే ఫాస్టాగ్ వాడకాన్ని తగ్గించడం, ఒకే వాహనానికి పలు ఫాస్టాగ్ లను తొలగించడమే లక్ష్యంగా ఎన్ హెచ్ఏఐ 'వన్ వెహికల్, వన్ ఫాస్టాగ్' కింద ఈ నిర్ణయాన్ని అమలు చేస్తోంది. అలాగే ఆర్బీఐ మార్గదర్శకాల ప్రకారం కేవైసీని పూర్తి చేయాలని వినియోగదారులను కోరింది. ఎలాంటి అసౌకర్యం లేకుండా చూసుకోవాలంటే వినియోగదారులు తమ ఫాస్టాగ్ కేవైసీ పూర్తయ్యేలా చూసుకోవాలని ప్రకటనలో పేర్కొంది. ఫాస్టాగ్ వినియోగదారులు 'వన్ వెహికల్, వన్ ఫాస్టాగ్'కు కట్టుబడి ఉండాలని, గతంలో జారీ చేసిన అన్ని ఫాస్టాగ్లను ఆయా బ్యాంకుల ద్వారా తొలగించాలని తెలిపింది. 2024 జనవరి 31 తర్వాత పాత ఫాస్టాగ్ లు డీయాక్టివేట్ అవుతాయని, కాబట్టి కొత్త ఖాతా మాత్రమే యాక్టివ్ గా ఉంటుందని పేర్కొంది.

# త్వరలో కుల గణన

(మొదటి పేజీ తరువాయి)

మహాత్మ జ్యోతిభా పూలే ఓవర్ సీస్ స్కాలర్ షిప్ పథకాన్ని మరింత సమర్థంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇప్పుడున్న దాని కంటే ఎక్కువ మంది అర్హులైన విద్యార్థులకు మేలు జరిగేలా చూడాలని కోరారు. విదేశాల్లో ఉన్న యూనివర్సిటీల ర్యాంకింగ్ ల ఆధారంగా టాప్ యూనివర్సిటీలను గుర్తించి ఫ్రేమ్ వర్క్ తయారు చేయాలన్నారు. వాటిలో చదివేందుకు వెళ్లే విద్యార్థులకు ఈ స్కీమ్ లో మొదటి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఎస్సి, ఎస్టి, బిసి సంక్షేమ గురుకుల విద్యా సంస్థలన్నీ వేర్వేరు చోట్ల విడివిడిగా కాకుండా ఇంటిగ్రేటేడ్ ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటేడ్ హబ్ నిర్మించే ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. దీంతో స్కూళ్ల నిర్వహణ, పర్యవేక్షణ, అజమాయిషీ మరింత మెరుగ్గా చేసే వీలుంటుందని అన్నారు. ఎక్కువ మంది విద్యార్థులు ఒకే ప్రాంగణంలో చదువుకోవటం ద్వారా వారిలో ప్రతిభా పాఠవాలు పెరుగుతాయని, పోటీ తత్వం పెరుగుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. వెంటనే అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఎడ్యుకేషన్ హబ్ ల నిర్మాణానికి సరిపడే స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. నియోజకవర్గ కేంద్రంలో వీలు కాకుంటే ప్రత్యామ్నాయంగా అదే సెగ్మెంట్లో మరో పట్టణం లేదా మండల కేంద్రాలను ఎంచుకోవాలని సూచించారు.

ఇప్పటికే 20 ఎకరాలకుపైగా విస్తీర్ణమున్న స్కూల్ ప్రాంగణాల్లో మిగతా భవనాలు నిర్మించి హబ్ గా తీర్చిదిద్దే అవకాశాలుంటే పరిశీలించాలని అన్నారు. ఎడ్యుకేషన్ హబ్ ల నిర్మాణానికి కార్పొరేట్ సంస్థలు, కంపెనీల సహకారం తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. సిఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ) ఫండ్స్ ను సమీకరించాలని, ముందుకు వచ్చే దాతల నుంచి విరాళాలు స్వీకరించి ఈ భవన నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో అవసరమైన మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు ఇచ్చే దుప్పట్లు, నోట్ బుక్స్, యూనిఫామ్స్, పుస్తకాలకు కూడా సిఎస్ఆర్ ద్వారా నిధులు సమీకరించాలని సూచించారు.

కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు నగదుతో పాటు తులం బంగారం అందించేందుకు అంచనా బడ్జెట్ ను రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఇప్పుడున్న బిసి స్టడీ సర్కిళ్లను ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం యూనిట్ గా ఏర్పాటు చేసే అంశంపై అధ్యయనం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ప్రభుత్వ ప్రదాన కార్యదర్శి శాంతికుమారి, సంబంధిత శాఖల అధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.ద

# గడువు మరో నాలుగు రోజులే..




**పిసిడబ్ల్యూ న్యూస్/హైదరాబాద్ :**వాహనాల రాయితీ పెండింగ్ చలాన్ల ద్వారా ఇప్పటివరకు రూ.135 కోట్ల మేరకు ఆదాయం సమకూరిందని, చలాన్ల చెల్లింపులకు మరో నాలుగు రోజుల గడువు మాత్రమే మిగిలిందని పోలీసులు వివరిస్తున్నారు. కాగా ఇప్పటికే పెండింగ్ చలాన్ల చెల్లింపుల ద్వారా ప్రభుత్వానికి భారీగానే ఆదాయం సమకూరింది. రాష్ట్రవ్యాప్తంగా 3.59కోట్ల పెండింగ్ చలాన్లు ఉండగా ఇప్పటి వరకు 1,52,47,864 మంది చలాన్లు చెల్లించారు.ఇప్పటి వరకు 42.38శాతం మాత్రమే చలాన్లకు చెల్లింపులు జరిగాయి వాటి ద్వారా రూ.135 కోట్ల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో రూ.34కోట్లు, సైబరాబాద్ పరిధిలో రూ.25 కోట్లు, రాచకొండ పరిధిలో రూ.16 కోట్లు ఆదాయం సమకూరిందని తెలిపారు. రాయితీపై చెల్లించేందుకు మరో నాలుగు రోజులు మాత్రమే గడువు మాత్రమే ఉందని ఈ లోగా వాహనదారులు చలాన్లు చెల్లించాలని పోలీసులకు సూచించారు.%గతేడాది డిసెంబర్ 27నుంచి పెండింగ్ చలాన్లు చెల్లించేందుకు 15 రోజుల పాటు- అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. చలాన్ల చెల్లింపుల విషయంలో సాంకేతిక సమస్యలు తలెత్తగా ఈ నెల 31 వరకు పొడిగించింది. గడువు ముగిసిన తర్వాత మరోసారి పొడిగించే అవకాశం లేదని అధికారులు స్పష్టం చేశారు.

# మేడారం అమ్మవార్లను దర్శించుకుంటా


## జాతర పోస్టర్‌ను ఆవిష్కరించిన సీఎం రేవంత్



**పిసిడబ్ల్యూ న్యూస్/హైదరాబాద్ :**ఫిబ్రవరి 23న మేడారం జాతరకు వెళ్లి సమ్మక్క సారలమ్మను దర్శించుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి మేడారం పూజారుల సంఘం సభ్యులకు తెలిపారు.ములుగు జిల్లా మేడారంలోని సమ్మక్క సారలమ్మ మేడారం జాతరకు రావాలని మేడారం ఆలయ పూజారుల సంఘం శనివారం సచివాల యంలో సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేసింది.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారం మహా జాతర పోస్టర్‌ను ఆవిష్కరించారు. మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వొచ్చే నెలలో జరుగనున్న మేడారం జాతర ఏర్పాట్లు, సంబంధిత పనులపై దేవాదాయశాఖ అధికారులు సీఎం రేవంత్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

# బిహార్‌లో కొనసాగుతున్న ఉత్కంఠ..

## ఆదివారమే నీతీశ్ రాజీనామా!



**పిసిడబ్ల్యూ న్యూస్/హైదరాబాద్ :**పట్నా: బిహార్‌లో ఉత్కంఠ కొనసాగుతోంది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ మరోసారి కూటమి మార్చనున్నారు. ఒకట్రెండు రోజులుగా ఇదే విషయమై తీవ్ర చర్చ జరుగుతున్నా.. నీతీశ్ మాత్రం తన మౌనాన్ని కొనసాగిస్తున్నారు. మరికొన్ని గంటల్లో సస్పెన్స్‌కు తెరపడనుంది. ఆదివారం ఉదయమే నీతీశ్ తన రాజీనామా సమర్పిం చనున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆపై భాజపాతో కలిసి ప్రభుత్వ ఏర్పాటు ఉంటుందని పేర్కొన్నాయి.ఆదివారం రాజీనామా సమర్పించే ముందు నీతీశ్ కుమార్ జేడీయూ శాసనసభాపక్ష సమావేశం నిర్వహించనున్నారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఆదివారం అయినప్పటికీ.. సచివాలయాన్ని తెరిచే ఉంచాలని ఇప్పటికే ఉన్నతాధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. రాజీనామా చేసిన కొన్ని గంటల్లోనే భాజపాతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# పట్టాలు కోల్పోయిన పేదలకు న్యాయం చేస్తా

## దామోదర రాజనర్సింహ




**పిసిడబ్ల్యూ న్యూస్/హైదరాబాద్ :**ప్లాట్ల పట్టాలు కోల్పోయిన పేదలకు న్యాయం చేస్తానని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శనివారం గద్వాల జిల్లాకు చేరుకున్నఆయన అల్లంపూర్ గద్వాల నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభించి, శంకుస్థాపన చేసిన అనంతరం గద్వాల జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మితమవుతున్న 300 పడకల ఆసుపత్రిని సందర్శించారు మంత్రి దామోదర రాజనర్సింహ. గద్వాల పట్టణంలోని 300 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనుల పరిశీలన చేసిన అనంతరం అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇచ్చిన ఇళ్ళ పటాలను తీసుకుని వాటి స్థానంలో అక్కడ కొత్తగా నిర్మాణం చేపడుతున్న 300 పడకల ఆసుపత్రి చేపడుతున్న విషయం తెలిసింది.అయితే పట్టాలు కోల్పోయిన బాధితులు మంత్రి పర్యటన సందర్భంగా అక్కడికి చేరుకొని న్యాయం చేయాలని మంత్రిని కోరగా.. న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే సమీక్ష సమావేశానికి మొదటిసారిగా జిల్లాకు వచ్చిన సందర్భంగా గద్వాల మండల పరిధిలోని అనంతపురం స్టేజీ వద్ద వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నరసింహకు గజమాలతో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ సరిత స్వాగతం పలికారు.

# పేదల కోసం పోరాడే కమ్యూనిస్టులకు ప్రజలు అండగా నిలువాలి

**- సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి**



**పిసిడబ్ల్యూ న్యూస్/కురవి:** పేదల హక్కుల కోసం నిరంతరం పోరాటాల నిర్వహించే కమ్యూనిస్టులకు ప్రజలు అండగా నిలవడం ద్వారా ప్రజాస్వామిక హక్కులు కాపాడబడతాయని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. డోర్నకల్ మండల కేంద్రంలో సిపిఐ మండల కార్యవర్గ సమావేశం జరగగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామీణ స్థాయిలో పేదలకు అందే విధంగా కార్యకర్తలు చురుకుగా పని చేసి పార్టీ విస్తరణకు తోడ్పడాలని కోరారు.కేంద్రంలో పాలన చేస్తున్న బిజెపి దేశంలో ప్రజలు ఆకలి, అనారోగ్యం, అధిక ధరలు, ఉపాధి లేమితో బాధపడుతుంటే, భక్తిని మతాన్ని రాజకీయాలతో కలగలపి రాముని పేరుతో తిరిగి అధికారంలోకి రావడానికి పెద్ద ఎత్తున ప్రచార ఆర్భాటాలతో ప్రయత్నాలు చేయడాన్ని సిపిఐ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నారు.ఆకలి సూచీలో 122 దేశాలలో భారత్ 107 వ స్థానం ఆక్రమించింది గత నాలుగేళ్లలో నిరుపేదల సంఖ్య 19 కోట్ల నుండి 35 కోట్లకు చేరిందని, 67% సంపద కేవలం 1 శాతం కుబేరుల చేతిలోకి, 50 శాతం మంది దగ్గర కేవలం మూడు శాతం సంపద మాత్రమే ఉందని ఇలాంటి అసమాన తల భారత్ సృష్టిస్తు, కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంబిస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని రాబోయే సార్వత్రిక ఎన్నికలలో ఇంటికి పంపించాలని అన్నారు.పార్టీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా పార్టీ విరోచిత పోరాటాలను ఘనంగా ప్రచారం నిర్వహించి పార్టీ సభ్యత్వాన్ని మరింత పెంచడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి తురక రమేష్ జిల్లా కార్యవర్గ సభ్యులు నెల్లూరు నాగేశ్వరరావు, కే ప్రబేష్, స్వామి, పోలేపాక వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల, మాజీ ఎంపీ సీతారాం



**పిసిడబ్ల్యూ న్యూస్/హనుమకొండ జిల్లా స్టాపర్:** ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీడబ్ల్యూజేఏ) నూతన సంవత్సర క్యాలెండర్-2024 ను శనివారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో.. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజుతో వ్యవస్థాపక అధ్యక్షులు బానోత్ వెంకట్ నాయక్ , హనుమకొండ జిల్లా అధ్యక్షులు గుగులోత్ హుస్సెన్ నాయక్ లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్ మాట్లాడుతూ..హనుమకొండ జిల్లా గిరిజన యువత మీడియా వైపు రావడం శుభ పరిణామమని,సింధు నాగరికత నుంచి లిపి లేకుండా జీవనం సాగిస్తున్న గిరిజనుల మూలాలు వెలికి తీయాల్సిన బాధ్యత గిరిజన మీడియా మిత్రులకు ఉందని మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్ అన్నారు. ఈ మేరకు శనివారం మేడారం జాతర సమయంలో మాత్రమే ప్రజా ప్రతినిధులు వచ్చి పోతుంటారని, కానీ అక్కడ జీవిస్తున్న ఆదివాసీ, లంబాడీల జీవిత మూలాలను బాహ్య ప్రపంచానికి పరిచయం చేయడం లేదని పేర్కొన్నారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో గిరిజనులకు రిజర్వేషన్ అమలు చేయడం ఏంటని ప్రశ్నించారు. పేరుకే గిరిజన విశ్వవిద్యాలయం అని, కానీ కాకతీయ, ఉస్మానియా యూనివర్సిటీల వలే పరిపాలన ఉందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచన చేసి గిరిజనుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. అలాగే గిరిజన జాతుల వ్యాప్తి పై పరిశోధన చేయాలని ఆయన సూచించారు. అదేవిధంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు మాట్లాడుతూ గిరిజన జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యుల అభివృద్ధికి తన వంతు సహకారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రెస్ క్లబ్ తరఫున పాటుపడతామని వివరించారు.ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఏ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గుగులోత్ హుస్సెన్ నాయక్ , ప్రధానకార్యదర్శి దేవేందర్ నాయక్ , చిన్న పత్రికల సంఘం అధ్యక్షులు అంతడుపుల శ్రీనివాస్ , రిపోర్టర్లు శోభన్ బాబు, మాద నర్సయ్య ,రమేష్ , వివిధ పత్రికల రిపోర్టర్లు పాల్గొన్నారు.


# రాజకీయాల కన్నా ప్రజల ఆర్థిక సామాజిక అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తా...

**- ప్రజల సహకారంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా: ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి**



**పిసిడబ్ల్యూ న్యూస్/నడికూడ ప్రతినిధి:**కౌకొండ నూతన గ్రామపంచాయతీ భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి కౌకొండ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్, సి డి పి నిధుల నుంచి రూ.26 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని శనివారం పరకాల ఎమ్మెల్యే శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి గారు ప్రారంభించారు.ఎమ్మెల్యేగా గెలిచి మొదటిసారిగా గ్రామానికి వచ్చిన శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి కి గ్రామస్తులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తో పాటు పంచాయతీ వార్డు సభ్యులు పుష్పగుచ్ఛం అందించి శాలువ కప్పి సత్కరించారు.అనంతరం ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని అన్నారు.గ్రామంలో అనేక సమస్యలు నా దృష్టికి తీసుకువచ్చారని ప్రాధాన్యత క్రమంలో వాటిని పూర్తి చేసేందుకు తాను కృషి చేస్తానని అన్నారు.గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వల్ల దనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చిందని రాష్ట్ర ఆర్థిక వాస్తవ పరిస్థితిని ప్రజల ముందు పెట్టి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతామని ఇప్పటికే రెండు గ్యారెంటీలు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఆరోగ్యశ్రీ 10 లక్షలు రెండు గ్యారెంటీలు అమలు చేసామని మిగతా గ్యారెంటీ హామీలపై ఎటువంటి అపోహలకు గురి కావద్దని అన్నారు.తాను రాజకీయాల కన్నా ప్రజల ఆర్థిక సామాజిక అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తానని యువతకు ఉపాధి అవకాశాలు పెంచడం, రైతులకు ఆర్థిక యంత్రాలు అందుబాటులోకి తెచ్చి పండించిన పంటలకు గిట్టుబాట ధర కల్పించి వారి ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా మొదటి ప్రాధాన్యతగా ఎంచుకున్నానని ప్రజల సహకారం ఉంటే గ్రామాల అభివృద్ధితో పాటు ప్రజల ఆర్థిక సామాజిక అభివృద్ధికి ప్రాధాన్యత క్రమంలో తాను నిబద్ధతతో పూర్తి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు గ్రామ ప్రజలు యువత పాల్గొన్నారు.

# వేం నరేందర్ రెడ్డిని కలిసిన డాక్టర్ రామచంద్రనాయక్ డోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వం విప్



**పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వ సలహాదారునిగా నియమితులైన మానుకోట జిల్లా మానుకోట నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే పెద్దలు గౌరవనీయులు గురువర్యులు వేం నరేందర్ రెడ్డి ని వారి నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపిన డోర్నకల్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ దంపతులు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయన మాట్లాడుతూ డోర్నకల్ నియోజకవర్గ మరిన్ని నిధులు ఇవ్వాలని విద్య వైద్యానికి ప్రత్యేకంగా ప్రోత్సహించాలని వారిని కోరారు. ఇట్టి విషయాన్ని స్పందించి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ డోర్నకల్ నియోజకవర్గ అంటే నాకు ప్రత్యేకమైన ప్రేమ అబిమానాలు ఉంటాయని నియోజకవర్గంలో ప్రతి గడప నావల్లేనని డోర్నకల్ ప్రజలకు మానుకోట ప్రజలకు సేవ చేసే భాగ్యం మరింత కలిగిందని వారన్నారు. అనంతరం ఆయనను శాలువా కప్పి సన్మానించారు.

# నేడు ఎస్ జిపిఎటి ఆధ్వర్యంలో సీనియర్ పెన్షనర్లకు సన్మానం..

**పిసి డబ్ల్యూ న్యూస్ ప్రతినిధి/ఖమ్మం:** రాష్ట్ర ప్రభుత్వ పెన్సనర్ల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సీనియర్ పెన్సనర్లకు సన్మానం చేయనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వరిశ పుల్లయ్య, కె. కృష్ణమూర్తి నేడొక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు సన్మాన కార్యక్రమం ప్రారంభమవుతుందని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఏర్పాటై 47 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సన్మాన కార్యక్రమం చేపట్టినట్లు వారు తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడిసిఈవో వివి అప్పారావు, విద్యా శాఖాధికారి సోమశేఖర శర్మ. ట్రెజరీ అధికారి వి. సత్యనారాయణ, జిల్లా సంక్షేమ అధికారి సుమ, ఎస్టిడో ఎల్లయ్య తో పాటు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంచి నర్సింగరావు, ఉపాధ్యక్షులు టి. పురుషోత్తమరావు, యూనియన్ రాష్ట్ర నాయకులు యాదయ్య, సూర్యనారాయణ హాజరు కానున్నట్లు పుల్లయ్య, కృష్ణమూర్తి తెలిపారు.




# ఎస్సీ కాలనీలో పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన




**పిసిడబ్ల్యూ న్యూస్/హనుమకొండ జిల్లా స్టాపర్:** హనుమకొండ జిల్లా కాజీపేట పట్టణం, 62వ డివిజన్ సోమిడీ ఎస్సీ కాలనీ కమిటీ హాల్ వద్ద 5 లక్షల జనరల్ ఫండ్ తో ఎస్సీ కాలనీ కమిటీ హాల్ కాంపౌండ్ మరియు సిసి రోడ్, ప్యాచ్ వర్క్ అభివృద్ధి కార్యక్రమాలను కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ శంకుస్థాపన చేశారు. అనంతరం కాలనీవాసులతో కలసి ఎస్సీ కాలనీ నీ సందర్శించి త్వరలో నూతన ఎలక్ట్రికల్ పోల్స్, కాలనీని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ రవీందర్ యాదవ్ మాట్లాడుతూ మన 62వ డివిజన్ లో అనేక రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని, డివిజన్ అభివృద్ధి ఏకైక లక్ష్యమని, 62వ డివిజన్ ని ఆదర్శ డివిజన్ గా తీర్చిదిద్దుతామని, ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ డైరెక్టర్ మెరుగు రాజయ్యయాదవ్, డాక్టర్ శ్రావణ్, దాడబోయిన వీరస్వామి, మాచర్ల జయకర్, నీల, బండారి సురేందర్, రవికుమార్, కుమ్మరి స్వామి తిప్పారపు మల్లేష్, మంద కుమారస్వామి, సాంబరాజు, జైజైరావు, నాగరాజు, ప్రసన్న లత, శ్రీను, బైరబోయిన రమేష్, దొంగల కుమార్, శివరాం, కూకట్ల రమేష్, అశోక్, జగన్నాచారి, రవీంద్ర చారి, రవికుమార్, బొంద్యాల్, యాసిన్, నవీన్, చిన్న, రేవంత్, ఆల్ వింగ్ ఆఫీసర్లు, ఎస్సీ కాలనీ పెద్దలు, స్థానిక మహిళలు, ఎస్సీ కాలనీ యూత్ సోదరులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, స్థానికులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# వినాయక వెల్ఫేర్ అసోసియేషన్ డైరీని ఆవిష్కరించిన ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి





**పిసిడబ్ల్యూ న్యూస్/హనుమకొండ జిల్లా స్టాపర్:**హన్మకొండ 6వ డివిజన్‌లో సిద్ది వినాయక వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్ మిర్యాల్కార్ దేవేందర్ ఆధ్వర్యంలో నేడు డైమండ్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని నీలిమా- రాజేందర్ రెడ్డి దంపతులు హాజరై నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మొహమ్మద్ అజీజ్ ఖాన్, కార్పొరేటర్లు పోతుల శ్రీమాన్, స్థానిక కార్పొరేటర్ చెన్నం మధు, విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు జిల్లాకి చేరుకున్న షర్మిల



**పిసిడబ్ల్యూ న్యూస్/నెల్లూరు జిల్లా:** నెల్లూరు జిల్లాకు చేరుకున్న పిసిసి రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలారెడ్డి ఈ సందర్భంగా కోవూరు జాతీయ రహదారి వద్ద హెూటల్ నెల్లూరు గ్రాండ్ సమీపంలో ఘన స్వాగతం పలికిన నెల్లూరు జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవ్ కుమార్ రెడ్డి, పి.సి.సి ప్రధాన కార్యదర్శి చేవూరు శ్రీధర్ రెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు గజమాలవేసి ఘన స్వాగతం పలికారు తనంతరం నెల్లూరు ఇందిరా భవనంలో జరగబోయే సమావేశంలో పాల్గొనేందుకు బయలుదేరారు.

# మరిపెడలో చెకుముకి మండల స్థాయి సైన్స్ సంబరాలు

**పిసిడబ్ల్యూ న్యూస్/మరిపెడ:** మరిపెడ మండల అధ్యక్షులు బయగాని రామ్మోహన్ అధ్యక్షతన స్థానిక కనకదుర్గ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన పలువురు వక్తలు మరిపెడ మండల స్థాయి చెకుముకి పోటీ పరీక్షల సమయంలో ముఖ్య అతిథిగా హాజరైన మండల తహసిల్దార్ సైదులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి శాస్త్రీయ అవగాహనను కలిగి ఉండి ప్రతి ప్రశ్నకు శాస్త్రీయ అవగాహన కలిగి ఉండాలి అన్నారు. మరిపెడ మండలం మున్సిపల్ కమిషనర్ ఏ. రాజు మాట్లాడుతూ విద్యార్థులలో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీయడంలో చెకుమికి దోహదపడుతుందని ప్రస్తుత పోటీ ప్రపంచాన్ని ఎదుర్కోవాలంటే చాలా అప్రమత్తతో ఉండాలన్నారు. మండల ఎస్సై షేక్ తాహేద్ మాట్లాడుతూ విద్యార్థులు మూఢనమ్మకాలను వీడి శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి విషయాన్ని ఎందుకు, ఏమిటి, ఎలా అని పరిశీలించి పరిశోధించాలన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త దారం నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు మీకున్న సౌకర్యాలను అత్యంత సామర్థ్యం గా ఉపయోగిస్తున్నప్పుడే ముందుకు వెళ్తారని, ఇలాంటి చెకుముకి కార్యక్రమాలు మీ ప్రతిభకు సానబెట్టేదిగా ఉంటాయన్నారు. జన విజ్ఞాన వేదిక మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగంపల్లి దయానంద్ మాట్లాడుతూ ప్రజల కోసం సైన్స్, ప్రగతి కోసం సైన్స్, శాంతి కోసం సైన్స్, స్వావలంబన కోసం సైన్స్, దేశం కోసం సైన్స్, పర్యావరణం కోసం సైన్స్ అను నినాదంతో జన విజ్ఞాన వేదిక పనిచేస్తుందని, సైన్స్ ప్రజలందరి దరికి చేరాలన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ ఏజె రామారావు



మాట్లాడుతూ రాజ్యాంగంలోని 51 ఏహెచ్ ఆర్టికల్ ప్రకారము ప్రతి ఒక్కరూ శాస్త్రీ అవగాహనని, శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఉండాలన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా కోశాధికారి డిగ్రీ కళాశాల ఆంగ్ల అధ్యాపకులు సాహితీ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తు ప్రాణాలికలకు మంచి లక్ష్యాన్ని ఏర్పరచుకొని ముందుకు సాగలన్నారు. సీతారాంపురం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మందాటి రామచంద్రు మాట్లాడుతూ పరీక్షలు అంటే భయాన్ని వీడి, ఆహ్లాదంగా ఎలా రాయాలో చెకుముకి నేర్పిస్తుందన్నారు. గుండెపుడి ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ గారు మాట్లాడుతూ పిల్లలకు పరీక్షల పట్ల ఉన్న భయాన్ని పోగొట్టే విధంగా చెకుముకి నిర్వహిస్తున్న జెవివి బాధ్యులను అభినందించారు. రాంపూర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శశిధర్ మాట్లాడుతూ ఇప్పటి విద్యార్థులు అత్యంత ప్రతిభాపాటవాలతో ముందుకు సాగుతున్నారని, వారి ప్రతిభకు అడ్డొచ్చే ప్రతి అంశాన్ని తీసివేయాలన్నారు. చెకుముకి సైన్స్ సంబరాల కన్వీనర్ షేక్ సుభాని మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో మండల వ్యాప్తంగా



1700 మంది విద్యార్థులు హాజరుకాగా, అందులో నుండి మండల స్థాయికి 72 మంది విద్యార్థులు ఎన్నికయ్యారు అన్నారు. మహబూబాబాద్ జిల్లా రాచకొండ రామచంద్రు, దీకుంట్ల వెంకన్న ,జనార్ధన్, మంగు, వెంకన్న, రాము, రాజకుమారి, విద్యార్థినీ విద్యార్థులు ,పాఠశాలల గైడ్ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా స్థాయికి ఎంపికైన పాఠశాలలు ఇవే. ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం విభాగం నుంచి టీఎస్ మోడల్ స్కూల్, మరిపెడ. ప్రభుత్వ తెలుగు మీడియం విభాగం నుంచి జడ్పిహెచ్ఎస్ వీరారం హై స్కూల్, ప్రైవేట్ ఇంగ్లీష్ మీడియం విభాగం నుంచి గ్లోబల్ కేరళ మోడల్ స్కూల్ ఎంపికయ్యాయి. కాగా జిల్లా స్థాయి పోటీకి ఎంపికైన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులను, సర్టిఫికెట్లని, మెమొంటోలని ప్రముఖ వ్యాపారవేత్త దారం నాగేశ్వరరావు గారి సహకారంతో అందజేశారు. టీములు ఫిబ్రవరి 3న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించబోయే జిల్లా స్థాయి చెకుముకి పరీక్షలకు హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

## బిజెపి గిరిజన మోర్చా మండల అధ్యక్షుడిగా భూక్య కిషన్ నాయక్



**పిసిడబ్ల్యు న్యూస్/కురవి:** భారతీయ జనతా పార్టీ కురవి మండలం లో బలపాల లింగయ్య తండా కు చెందిన భూక్య కిషన్ నాయక్ బిజెపి గిరిజన మోర్చా మండల అధ్యక్షుడిగా నియమించడం జరిగింది ఈ కార్యక్రమంలో బిజెపి కురవి మండల అధ్యక్షుడు బుడిగే భద్రసేన గౌడ్ మాట్లాడుతూ మండలంలో గిరిజనులను సమస్యలపై పోరాడాలని చెప్పడం జరిగింది. భూక్య కిషన్ నాయక్ మాట్లాడుతూ ప్రతి సమస్యను కొట్లాడి వారి సమస్యల పైన పోరాడుతానని చెప్పడం జరిగింది నన్ను నియమించిన కురవి బిజెపి మండల అధ్యక్షుడు బుడిగే భద్ర సేన గౌడ్ బిజెపి జిల్లా అధ్యక్షులు వద్ది రాజు రామచంద్ర రావు గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షులు డా. జాటోత్ పవన్ నాయక్ పార్లమెంట్ ఇన్చార్జి జాటోత్ హుస్సేన్ నాయక్ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్ డోర్నకల్ అసెంబ్లీ కన్వీనర్ పూర్ణ స్టేట్ కౌన్సిలర్ నెంబర్ కొనటం పెంటయ్య కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భూక్య రవి బి ఆర్ ఎస్ వార్డ్ నెంబర్ మలోత్ రమేష్ జాటోత్ ఏం రాజ్ భూక్య సురేందర్ బానోత్ రెడ్డి బానోత్ శీను గుగులోతు లచ్చు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## ప్రాథమిక పాఠశాలలో బ్యాండ్ బహుకరించిన కార్పొరేటర్



**పిసిడబ్ల్యు న్యూస్/హసన్‌పర్తి:** హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండలం లోనీ వంగపహాడ్ లో ఉన్న ప్రాథమిక పాఠశాల కు రెండవ డివిజన్ కార్పొరేటర్ ఎల్. రవి నాయక్ తన సొంత ఖర్చులతో బ్యాండ్ బహుకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని మంచి వృద్ధిలోకి రావాలని అన్నారు మరియు ఎలాంటి మౌలిక వసతులు కావాలన్నా తన దృష్టికి తీసుకురావాలని తన వంతు సాయం చేస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాడురి శ్రీనివాస్ ఉపాధ్యాయులు మరియు గ్రామస్తులు దోమ కుమార్ దేవయ్య, దోమ మురళి, నర్మెట సునీల్, తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన నాగుర్ల



**పిసిడబ్ల్యూ న్యూస్/నడికూడ ప్రతినిధి:** పరకాల నియోజకవర్గం మండలం నడిగూడ నర్సక్క పల్లె గ్రామానికి చెందిన మాజీ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి మేనమామ కి. శే.కేశిరెడ్డి సంజీవ రెడ్డి అనారోగ్యంతో మృతిచెందగా భౌతికానికి పూలమాలవేసి నివాళులర్పించిన బిఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు మాజీ తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు గ్రామ సర్పంచ్ తిప్పర్తి సాంబ రెడ్డి ఉపసర్పంచ్ ధర్మారావు హనుమకొండ జిల్లా ఆర్ఎంపీ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సంతోష్ రావు బీసీ రైతు సంఘం అధ్యక్షులు వరికల కిషన్ రావు నాగుర్ల బాపురావు దేవేందర్ మోర్తల దేవేందర్ సూరవు కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు. సర్పంచ్ తిప్పర్తి సాంబ రెడ్డి ఉపసర్పంచ్ ధర్మారావు హనుమకొండ జిల్లా ఆర్ఎంపీ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సంతోష్ రావు బీసీ రైతు సంఘం అధ్యక్షులు వరికల కిషన్ రావు నాగుర్ల బాపురావు దేవేందర్ మోర్తల దేవేందర్ సూరవు కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## రజక వృత్తిదారులు అన్ని రంగాల్లో ముందుండాలి

**- తెలంగాణ రజక సంఘం జిల్లా కార్యదర్శి పున్నం సారయ్య**



**పిసిడబ్ల్యు న్యూస్/కురవి:** మండల వీరభద్ర స్వామి ఆలయలో ప్రత్యేక పూజలు నిర్వహించి న్నారు.శనివారం జరిగిన ముఖ్య సంఘం నాయకుల సమావేశంలో మాట్లాడుతూ రజక వృత్తిదారులు అన్ని రంగాల్లో ముందుంటారని తెలంగాణ రజక సంఘం జిల్లా కార్యదర్శి పున్నం సారయ్య తెలిపారు.మండల కేంద్రంలోని రజకుల సాధక బాధకాలు తెలుసుకొని,వారి కష్టాలకు అనుగుణంగా సత్యంగా ఉన్న పనులను సక్రమంగా నిర్వహించుకునేటట్టు చేయాలని వారు అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో రజక కులస్తులు ఆర్థికంగా గాని అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని ఆయన కొనియాడారు.ఆయన వెంట టిఆర్ వి ఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పొడకంటి శేఖర్,మండల నాయకులు,సభ్యులు పూసపాటి మహేష్,మామిడాల భద్రయ్య, చిక్కుల కందగిరి,నరేష్,అక్కినపల్లి లింగన్న,శివ,మామిడాల వీరన్న, మోసం ఉప్పలయ్య,మోసం నారయ్య,పగడాల ఉప్పలయ్య, కనకం విజయ్,కోడి మధు,నగేష్, దోసపాటి వీరన్న,నాగరాజు,సాయి తదితరులు ఉన్నారు.

## సర్వసభ్య సమావేశానికి హాజరైన మేడిపల్లి సత్యం



**పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి/గంగాధర:** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం కొడిమ్యాల మండలం తిర్మలాపూర్( సంద్రాలపల్లి) గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని, అలాగే నూతన అంగన్వాడి స్కూల్కొడిమ్యాల మండలంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న శాసనసభ్యులు మేడిపల్లి సత్యం అనంతరం సర్పంచులకు సన్మానం చేశారు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## ఫలించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృషి

**- నేడు నారాయణపూర్ ఎల్లంపల్లి జలాలుహర్షం వ్యక్తం చేస్తున్న చొప్పదండి నియోజకవర్గం రైతులు**

**పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి/గంగాధర:** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం ఎల్లంపల్లి ప్రాజెక్టు నుండి గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్ కు నీటిని విడుదల చేయడానికి అధికారులు సిద్ధమైనారు.ఆదివారం నారాయణపూర్ రిజర్వాయర్ కు నీటిని విడుదల చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ధర్మారం మండలం నంది మేడారం పంప్ హౌస్ వద్ద మరమ్మతులు పూర్తి కావడంతో నీటి విడుదలకు అడ్డంకులు తొలగిపోయాయి.రోజుల క్రితం ఎమ్మెల్యే సత్యం మరమ్మత్తు పనులను పరిశీలించారు. పనులను పూర్తి చేసి నీటిని విడుదల చేయాలని అధికారులకు సూచించారు.ఎమ్మెల్యే ఆదేశంతో త్వరితగతిన మరమ్మత్తు పనులను పూర్తి చేసిన అధికారులు ఆదివారం నారాయణపూర్ రిజర్వాయర్ కు నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.చొప్పదండి నియోజకవర్గం లోని ఇంచు భూమిని కూడా ఎండనివ్వమని, రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని, నారాయణపూర్ రిజర్వాయర్కు నీటిని విడుదల చేసి చివరి మడి వరకు నీటిని అందజేస్తామని భరోసాకల్పించారు.నారాయణపూర్ రిజర్వాయర్ కు నీటిని విడుదల చేస్తుండడంతో చొప్పదండి నియోజకవర్గం రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## నూతన గ్రామపంచాయతీ ప్రారంభోత్సవం

**- ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తా : అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**పిసీడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి/వెల్గటూర్:** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం తాళ్ళ కొత్తపేటలో నూతన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని శనివారం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. వారు మాట్లాడుతు కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని,అర్హులైన ప్రతి పేదవారికి ప్రభుత్వ ఫలాలు అందేలా కృషి చేస్తానని అన్నారు. వెల్గటూర్ మరియు ఎండపెల్లి మండలాలకు చెందిన ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు నా పరిధిలో ఉన్న ప్రతి సమస్యను పరిష్కరిస్తామని,రాష్ట్రం ఎంత ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ప్రజలకు హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తప్పక అమలు చేసి తీరుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.పి. కూనమల్ల లక్ష్మీ లింగయ్య, సర్పంచ్ ద్యావనపల్లి లక్ష్మీ ఎల్లయ్య,వెల్గటూర్ కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షులు తాడిపర్తి శైలేందర్ రెడ్డి. ఉప సర్పంచ్.ఎంపిటిసి రంగు తిరుపతి. గ్రామ శాఖ అధ్యక్షులు బద్దం అంజిరెడ్డి. ఉపాధ్యక్షులు గోపికృష్ణ మరియు పాలకవర్గ సభ్యులు గ్రామస్తులు ప్రజలు పాల్గొన్నారు.

## తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



**పిసిడబ్ల్యూ న్యూస్/హనుమకొండ జిల్లా స్టాపర్:** తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్-హనుమకొండ (ట్రెసా) క్యాలెండర్, డైరీ ని శనివారం హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ మహేందర్ జీ చేతుల మీదుగా ఆవిష్కరించారు.ట్రెసా అధ్యక్షులు, ఉమ్మడి వరంగల్ జిల్లా కో ఆర్డినేటర్ గనిపాక రాజ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఇర్ఫాన్, అసోసియేషన్ బాధ్యులు, తహసీల్దార్లు ఎ. వి. భాస్కర్, ఎండి. రియాజోద్దీన్, ఎన్. జగన్ మోహన్ రెడ్డి, కె. సత్యనారాయణ, ఫణి కుమార్, అబిద్ అలీ, గౌరిశంకర్, బి. విశ్వనారాయణ, జ్యోతి వరలక్ష్మి దేవి, సురేష్ కుమార్, సూర్యనారాయణ, సంతోష్, విఠల్, జి. శ్రీనివాస్ రెడ్డి, శ్యామ్, శంకర్, కిరణ్, అమర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 50 కిలోల బియ్యం నిత్యవసర సరుకులు సహాయం అందజేసిన కౌన్సిలర్



**పిసిడబ్ల్యూ న్యూస్/రేగొండ:** రేగొండ మండల్ దమ్మన్నపేట గ్రామంలో పద్మశాలి కుల బాంధవుడు నిరుపేద కుటుంబానికి చెందిన వలస కృష్ణ అనే వ్యక్తి, అనారోగ్యం తో బాధపడుతూ అకాల మరణం చెందడం జరిగింది, వారికి సహాయం చేయాలన్న ఆలోచనతో పరకాల మున్సిపాలిటీ 9వ వార్డు బిజెపి కౌన్సిలర్ బెజ్జెంకి పూర్ణ చారి వారికి మానవత్వంతో 50 కిలోల బియ్యం నిత్యవసర సరుకులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పూర్ణ చారి తో పాటు అతడి భార్య వలస అనిత,కుమారుడు చరణ్,తల్లి చంద్రకళ, మరియు పుట్ట రవీందర్ ,దాసరి రవి, కోర్ర నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## జనవిజ్ఞాన వేదిక మొగుళ్ళపల్లి ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్ట్



**పిసిడబ్ల్యూ న్యూస్/మొగుళ్ళపల్లి:** జనవిజ్ఞాన వేదిక మొగుళ్ళపల్లి ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్ట్ మొగుళ్ళ పల్లి ఉన్నత పాఠశాల లో నిర్వహించడం జరిగినది. ఈ టెస్ట్ కి మండలంలోనీ అన్ని ఉన్నత పాఠశాల ల విద్యార్థులు పాల్గొనడం జరిగినది. ఈ టెస్ట్ లో మహాత్మా జ్యోతిభాపులే మొగుళ్ళపల్లి విద్యార్థులు ప్రథమ, మహాత్మా జ్యోతభాపులే వెంకటపుర్ ద్వితీశ్రేణి లో బహుమతులు పొందినారు అనంతరం జనవిజ్ఞాన వేదిక కన్వీనర్ విజయ భాస్కర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు పింగళి విజయపాల్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ శాస్త్ర సాంకేతక రంగాల్లో విధ్యార్థులు రాణించాలని లాజికల్ థింకింగ్ అలవాటు చేసుకోవాలని తెలిపారు. మండల నోడల్ ఆఫీసర్ కుమారస్వామి మాట్లాడుతూ సమాజం లో నెలకొన్న మూఢ నమ్మకాలు నిర్మూలించడం కోసం కృషి చేయాలని సూచించారు అనంతరం గెలుపొందిన విద్యార్థుల కు మేమొంటోస్ అందించారు. ఫిబ్రవరి 3 న జిల్లా స్థాయి లో జరిగే టెస్ట్ కి మహాత్మా జ్యోతి భాపూలే మొగుళ్ళపల్లి విద్యార్థులు పాల్గొనలని కోరారు. ఈ కార్యక్రమం లో మండల కో కన్వీనర్ రాజు ,అనిల్ కుమార్ వివిధ పాటశాల ల గైడ్ టీచర్ లు పాల్గొన్నారు.

## ఘనంగా 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

**- రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కి నివాళి అర్పించిన గ్రామ ప్రజలు**

**- భారత రాజ్యాంగానికి పూలతో అలంకరించి గణతంత్ర వేడుకలు**




**పిసిడబ్ల్యూ న్యూస్/బెల్లంపల్లి:** లంబడి తండా గ్రామపంచాయతీలో మేము సైతం గ్రంథాలయం - కామన్ సర్వీస్ సెంటర్ వద్ద 75 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు మేము సైతం ఎడ్యుకేషన్ రూరల్ డెవలప్మెంట్ యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వ్యవస్థాపకులు రంగ ప్రశాంత్ అధ్యక్షతన ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించాటం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీమతి శిరిష గారు, గ్రామ పెద్దలు కనవేని రాజేశం, రంగ మల్లేష్, గ్రామ ఉప సర్పంచ్ కందుల శశిరేఖ - ముకుంద, గ్రామ ప్రభుత్వ ఉపాధ్యాయులు రమేష్ విచ్చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు రంగ మల్లేష్ జెండా ఆవిష్కరించడం జరిగింది.. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్తలు రంగ ప్రశాంత్ - వ్యవస్థాపకులు " మేము సైతం ఎడ్యుకేషన్ రూరల్ డెవలప్మెంట్ యూత్ వెల్ఫేర్ సొసైటీ " మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అనుసరించవలసీన బాధ్యత ప్రతి ఒక పౌరుందని,గణతంత్ర దినోత్సవాన్ని భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజుగా జరుపుకుంటారని, ప్రతి సంవత్సరం జనవరి 26ను భారత గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటారని, 1950 జనవరి 26న భారత ప్రభుత్వ చట్టానికి (1935) బదులు భారత రాజ్యాంగం దేశపరిపాలనకు మార్చుడాన్ని భారత గణతంత్ర దినోత్సవం అంటారని, భారత రాజ్యాంగ సభలో 1949 నవంబరు 26న రాజ్యాంగం ఆమోదం పొందగా భారతదేశం స్వతంత్ర గణతంత్రంగా ఆవిర్భవించేందుకు 1950 జనవరి 26లో దీనిని ఒక ప్రజాతంత్ర పరిపాలన పద్ధతితో పాటుగా అమలులోకి తీసుకురావాలని నిర్ణయించారని అన్నారు. రానున్న రోజుల్లో గ్రామపంచాయతీ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అందరు కలిసి సమిష్టిగా గ్రామ అభివృద్ధి చేసుకుందామని అన్నారు. ఈ జెండా ఆవిష్కరణకు విచ్చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రమాదేవి గ్రామ అంగన్వాడి టీచర్, జవాజి రాజేశం , కోట రవి, బాపు స్వామి, రంగ శంకర్, యాదండ్ల బాలకృష్ణ, అజ్మీర సుభాష్ చంద్రబోస్, గుర్రాల సతీష్, పల్లపాటి వికాస్, తాటికొండ సత్యనారాయణ ,గ్రామ కో ఆప్షన్ నెంబర్ రంగ శ్రీలత, కుచ్చుల రోజా, మేము సైతం స్వచ్ఛంద సమితి సభ్యులు రంగ శ్రీరామ్, గుర్రాల రాజు, రంగా సాయి, హరీష్, సాయిరాం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## వైయస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాల్లో ఎమ్మెల్యే ప్రసన్న






**పిసిడబ్ల్యూ న్యూస్/నెల్లూరు జిల్లా:** కోవూరు రుక్మిణి కళ్యాణమండపం నందు వైయస్సార్ ఆసరా నాలుగోవ విడత సంబరాల్లో భాగంగా మండలంలోని 898 సంఘాలలోనీ 10,293 సభ్యులకు రూ. 6 కోట్ల, 83 లక్షల 15 వేల రూపాయల చెక్కులను అక్క చెల్లెమ్మలకు అందజేసిన కోవూరు నియోజవర్గ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి , ఈ కార్యక్రమంలో పొదుపు సంఘాల మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు ముందుగా ఆయనకు పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు ఘన స్వాగతం పలికారు అనంతరం ఆసరా పథకంతో బ్రతుకుతున్న అక్క చెల్లెమ్మలు ఏర్పాటు చేసిన స్టాల్ ను వీక్షించి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు అక్క చెల్లెమ్మ లతో కలిసి సీఎం జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు అనంతరం దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాయింట్ కలెక్టర్ కూర్మానాద్ పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో 33 సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్ మోహన్ రెడ్డి దాన్ని తెలిపారు. ఎమ్మెల్యే కామెంట్స్ వడ్డీ లేని రుణాలు ఆసరా రుణాలు అమ్మఒడి ఇవన్నీ మహిళా శక్తి కి అందించిన పథకాలు అని తెలిపారు మహిళలు లేకుండా ఉంటే వైఎస్ఆర్సిపి లేదని మీరే మా ఓటు బ్యాంక్ గత ప్రభుత్వంతో మన ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో గుర్తుచేసుకుని ఆత్మ సాక్షిగా ఓటేయాలని పిలుపునిచ్చారు వచ్చే ఎన్నికల్లో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు శాసనసభ్యులుగా నన్ను రాష్ట్రానికి ముఖ్యమంత్రి గా మరల జగన్మోహన్ రెడ్డిని గెలిపించాలని ప్రజల్ని కోరారు. అనంతరం పొదుపు మహిళలకు మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి యువజన విభాగం అధ్యక్షులు నల్లపురెడ్డి రజిత్ కుమార్ రెడ్డి, దొడ్డం రెడ్డి నిరంజన్ బాబు రెడ్డి ,పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, గొల్లపల్లి విజయ్ కుమార్ , సుబ్బారెడ్డి, కవరగిరి శ్రీలత, పార్వతి, కవరగిరి ప్రసాద్ ,వెలుగు ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

## కోదండరామ్‌కు ఎమ్మెల్సీ ప్రజా ఉద్యమాలకు గౌరవం

**- అభినందనలు తెలిపిన ఆల్ ఇండియా ఒబిసి జాక్**



**పిసిడబ్ల్యూ న్యూస్/హైదరాబాద్:** విప్లవోద్యమాల నుండి మొదలుకొని, హక్కుల సంఘాలు, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషించడమే కాకుండా తెలంగాణలో కెసిఆర్ దుష్ట పాలన అంతం కోసం అలుపెరగని పోరాటం చేసిన ప్రొఫెసర్ కోదండరామ్ కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడం ఉద్యమాలను గౌరవించినట్లని ఆల్ ఇండియా ఒబిసి జాక్ ఛైర్మన్ సాయిని నరేందర్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో గవర్నర్ కోటాలో కోదండరామ్ కు ఎమ్మెల్సీ పదవి లభించిన సంధర్భంగా శనివారం హైదరాబాద్ లోని కోదండరామ్ నివాసంలో కలిసి అభినందనలు తెలిపి మాట్లాడారు. ఉద్యమ నాయకులకు పదవులు ఇచ్చి గౌరవిస్తున్న తెలంగాణ ప్రభుత్వం ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చడంలో కూడా అంతే శ్రద్ధ చూపాలని కోరారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ ఎన్నో త్యాగాలతో సాధించుకున్న తెలంగాణలో గడచిన పదేళ్లలో ఎంతో అణచివేతకు జరిగిందని, ఉద్యమకారులను తీవ్రంగా అణచివేసి, ఉద్యమ ఆకాంక్షలను తుంగలో తొక్కారని అన్నారు. ఎన్నో ఉద్యమాలలో కీలకపాత్ర పోషించి ప్రజల కష్టాలను, తెలంగాణ బాధలను దగ్గర నుండి చూసిన నేను నాకు లభించిన పదవితో తెలంగాణలో ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చడంతో పాటు ఉద్యమకారుల సంక్షేమం కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది మహమ్మద్ మహమూద్, బి.సి నాయకులు కూనూరు రంజిత్ గౌడ్, కంకటి సాగర్‌లు పాల్గొన్నారు.

## జాతరగడవు సమీపిస్తున్నప్పటికీ ఆర్డబ్ల్యూఎస్ అధికారి జాడ ఎక్కడ ....?




**పిసిడబ్ల్యూ న్యూస్/ఆత్మకూర్:**మేడారం సమ్మక్క సారలమ్మ జాతర తర్వాత రెండో యువపెద్ద జాతరగా అగ్రంపాడు సమ్మక్క సారలమ్మ జాతర ప్రసిద్ధి చెందింది. ఈ జాతరకు లక్షలాదిమంది భక్తులు అమ్మవారులను దర్శించుకునేందుకు వస్తూ ఉంటారు. కానీ అందుకు తగ్గట్టుగా అధికారులు ఏర్పాట్లు చేయవలసి ఉంది. జాతరకు మరొక 25 రోజుల గడువే ఉంది. కానీ సంబంధిత ఆర్డబ్ల్యూఎస్ అధికారులు జాడ కనిపించడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. పెద్ద మేడారం జాతర నుంచి ఇరవై ఏడు లక్షల 50 వేల రూపాయలు మంజూరు అయ్యాయి. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి 59 లక్షల 65 వేల రూపాయల నిధులు మంజూరు చేయగా, అందులో సిడిఎఫ్ నిధులనుంచి 15 లక్షల 50 వేల రూపాయలు, తాగునీరుకు పారిశుద్ధ్య పనులపై ఖర్చు చేయవలసి ఉండగా, నేటి వరకు సంబంధిత అధికారులు జాతర ప్రాంగణంలో పనులు మొదలు పెట్టలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. డ్రింకింగ్ వాటర్ కు పారిశుద్ధ్యనికి 43 లక్షల రూపాయలు నిధులు వచ్చినప్పటికీ, అధికారులు జాతర వైపు కన్నెత్తి చూడడం లేదని, అగ్రంపాడు, అక్కంపేట బొంతల పెల్లి, చౌల్లెపల్లి గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

## ఫిబ్రవరి రెండు నుంచి పాలేరు నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్

**- టోర్నమెంట్ బ్రోచర్‌ను ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి**



**పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి/హైదరాబాద్ :** ఖమ్మం రూరల్ మండలం కరుణగిరి కేంద్రీయ విద్యాలయం రోడ్ లో పీఎస్ఆర్ యూత్ ఏనుగు మహేష్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2 నుంచి 9వ తేది వరకు పాలేరు నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ జరగనుంది. ఇందుకు సంబంధించిన బ్రోచర్, టీ షర్ట్స్ ను హైదరాబాద్ లోని మినిస్టర్ క్వార్టర్స్ లో తెలంగాణ రెవెన్యూ , గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆవిష్కరించారు. టోర్నమెంట్ నిర్వహణకు శ్రీకారం చుట్టిన మహేష్ ని పొంగులేటి ప్రత్యేకంగా అభినందించారు.

## నూతన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఉపముఖ్యమంత్రి భట్టి




**పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి/మధిర:** మధిర నియోజకవర్గం మధిర మండలం బయ్యారం గ్రామంలో 20 లక్షల రూపాయలతో నిర్మాణం చేసిన గ్రామ పంచాయతీ కార్యాలయం భవనాన్ని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొర్రె ముచ్చు ప్రకాశమ్మ, ఎంపీటీసీ జయరాజు, ఉప సర్పంచ్ కమతం రమేష్, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మరిపెడలో ఘనంగా ఎలక్ట్రీషియన్ డే ర్యాలీ తీసిన ఎలెక్ట్రీషన్లు




**పిసిడబ్ల్యూ న్యూస్/మరిపెడ:** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలో ఎలక్ట్రీషియన్ డే ఆ సంఘం అధ్యక్షుడు బయ్యా రవి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎలెక్రిషన్ కార్మికులను ఆదుకోవాలని, కార్మికులందరికీ లేబర్ కార్డులు ఇప్పించాలని కోరారు. అదే విధంగా నీరుపేద కార్మికులను గుర్తించి వారికీ ప్రజా పాలనలో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. యూనియన్ భవనానికి స్థలాన్ని కేటాయించాలని, కార్మికులకు ప్రమాద భీమా అందించాలన్నారు. అదేవిధంగా యూనియన్ లోని కార్మికులంతా కలిసి సమస్యల సాధనకు కృషి చేయాలన్నారు. తొలుత పట్టణంలో బైక్ ర్యాలీ తీసి అనంతరం జెండా ఎగురవేశారు. ఉపాధ్యక్షుడు శ్యామ్, నాగరాజు, వేణు, రాజేందర్, శ్రీను బోధ, సతీష్ బల్ల, రావిరాల మహేష్‌లు పాల్గొన్నారు.

## ఘనంగా ఎలక్ట్రీషిన్ దినోత్సవ వేడుకలు



**పిసిడబ్ల్యూ న్యూస్/పరకాల:** పట్టణంలో ఘనంగా ఎలక్ట్రిషన్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం రోజున వెలుగు ప్రైవేట్ ఎలక్ట్రిషన్ టెక్నీషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు కరెంట్ బల్బు ని కనిపెట్టిన థామస్ అల్వా ఎడిషన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్ళు అర్పించారు. అనంతరం అసోషియన్ జెండాను ఎగర వేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో వెలుగు ప్రైవేట్ ఎలక్ట్రిషన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకునూరి రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ ఉమర్, ఉపాధ్యక్షుడు రాంచందర్, కార్యదర్శి సూర రఘు, సలహాదారులు పైండ్ల సమ్మయ్య, నాయకులు మామిడి మహేందర్, బీరెల్లి రాజేందర్, రవీందర్ తారక్, సుర హరీష్, శివప్రసాద్, మనోహర్, సాంబరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కటాక్షపురం పెద్ద చెరువులో అక్రమంగా ఓ కాంట్రాక్టర్ మట్టి తవ్వకాలు

**- పట్టించుకుని ఇరిగేషన్ నీటిపారుదల శాఖ అధికారులు - మండల సర్వసభ్య సమావేశంలో అధికారులపై ఎంపీపీ మార్కు సుమలత అగ్రం**

**పిసిడబ్ల్యూ న్యూస్/ఆత్మకూర్:** వారం నుంచి ఓ కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా పెద్దపెద్ద గుంతలు తీస్తూ మట్టిని అక్రమంగా తవ్వకాలు చేసినప్పటికీ ఇరిగేషన్, నీటిపారుదల శాఖ అధికారులు పట్టించుకోవడంలో విఫలమయ్యారని ఎంపీపీ మార్కా సుమలత ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మార్క సుమలత అధ్యక్షుతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఏఈ జ్యోతిరాణి మాట్లాడుతూ కటాక్షపురం చెరువులో మట్టి తవ్వకాలు చేస్తున్నది వాస్తవమే అన్నారు. కానీ వర్క్ ప్రభుత్వ నిబంధన ప్రకారం మట్టి




తీయవచ్చునని ఏఈ సర్ది చెప్తుండగా కానీ ఆ కాంట్రాక్టర్ నిబంధనకు విరుద్ధంగా పెద్ద లోద్దలుగా తీయడం వల్ల ప్రమాదాలు జరుగుతాయని ఎంపీపీ హెచ్చరించారు. గత ఐదు సంవత్సరాల నుంచి మల్కపేట చెరువులోకి ఎస్సారెస్పీ నీరు రావడంలేదని, ఎన్నోసార్లు సంబంధిత అధికారులకు వినతి పత్రం ద్వారా విజ్ఞప్తి చేసినప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని సర్పంచ్ వేణుగోపాల్ ఆరోపించారు. రెండు సంవత్సరాలుగా చెరువు కింద వరినాట్లు వేయడం లేదని ఎన్నోసార్లు అధికారులు తీసుకువెళ్లిన అయినప్పటికీ ఫలితం లేదన్నారు. గృహలక్ష్మి పథకంలో నిరుపేదలు ఇల్లు కట్టుకున్నప్పటికీ నేటికీ బిల్లు లు రావడం లేదన్నారు. అధికారులు వచ్చి ముగ్గులు పోసి ప్రారంభించారు. కానీ నేటికీ బిల్లులు రావడం లేదని అధికారుల పనితీరుపై వివరించకపడ్డారు. ఈ సమావేశంలో జెడ్పిటిసి రాధిక, వైస్ ఎంపీపీ రేవూరి సుధాకర్ రెడ్డి, అధికారులు లలిత, రవికుమార్,పశు వైద్యాధికారి ధర్మానాయక్, వైద్య అధికారి స్పందన, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ప్రసన్న మీద వ్యక్తిగత ద్వేషాలు లేవు: సురా

**- నా జోలికి రావద్దు**



**పిసిడబ్ల్యూ న్యూస్/నెల్లూరు జిల్లా:** బుచ్చి మండలంలోని కో ఆపరేట్ బ్యాంక్ మాజీ చైర్మన్ సురా శ్రీనివాసులు రెడ్డి జైలు నుంచి విడుదలయ్యాక విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 25 సంవత్సరాలు కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డితో నడిచినందుకు నాకు ఇచ్చిన బహుమతి ఒక్కసారా కేసు ఒక బెల్ట్ షాపు అమ్ముతున్నానని నా బారుపైన ఇంకో కేసు ఐదు రోజులు జైలు శిక్ష అన్నారు ఇటువంటి వ్యక్తితో 25 సంవత్సరాల ప్రయాణం చేసిన అని నాకే అసహ్యంగా వేస్తుందన్నారు నా భార్యాబిడ్డల గోస్ట్ కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి కి తగులుతుంది తెలిపారు జిల్లాలో పేరుగాంచిన నల్ల రెడ్డి కుటుంబం పరుగు తీశారన్నారు. తొమ్మిది నెలలుగా ప్రతి నెల రెండు లక్షల ఎమ్మెల్యేకి పంపిస్తున్నాను చెప్పారు 25 ఏళ్ల తనపై అక్రమ కేసులు బనా ఇస్తున్నారని ప్రశ్నించారు 2019 లో ప్రసన్న అప్పులు తాను చెల్లించారని చెప్పారు తాను నోరు విప్పితే అందరి చరిత్రలు బయటపెడతానని హెచ్చరించారు.

## వినియోగదారుల మండలి రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి, సంయుక్త కార్యదర్శి నల్లా రాజేందర్‌లు

**పిసిడబ్ల్యూ న్యూస్/ఆత్మకూరు:** తహశీల్దార్ జగన్మోహన్ రెడ్డిని కలవడం జరిగింది. ఆత్మకూరు మండలం పెద్దాపురం గ్రామంలో రెవెన్యూ, మైనింగ్ సంస్థలు బ్లాక్ గ్రనేట్ ను తీస్తున్నాయని, మైనింగ్ రూల్స్, మరియు రెవెన్యూ డిపార్ట్మెంట్ జి.వో.నెం 4 తేది 19-1-2015 ల ప్రకారం ఆయా ప్రాంతాల తహశీల్దార్ లు అనుమతులు తీసుకున్న తర్వాత నే మైనింగ్ శాఖ లైసెన్స్ లు ఇస్తాయని, కాని పెద్దాపురం మైనింగ్ సంబంధించి దొరకడం లేదని అధికారులు చెపుతున్నారని ఫిర్యాదు చేయడం జరిగింది. సర్వే నెంబర్ 584/1 లో రెండు మైనింగ్ సంస్థలు మైనింగ్ శాఖ చేసుకున్న అగ్రిమెంట్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని, ఇప్పటికే రెండు సంస్థలు పర్యావరణ నిబంధనలు అతిక్రమించి నందున న్యాయ స్థానాలు జరిమానా విధించాయని, లోకాయుక్త లో విచారణ జరుపుతున్నదని, అయినా కూడా నిబంధనల ప్రకారం మైనింగ్ నిర్వహించక పోవడం పై రెవెన్యూ శాఖ ఇకనైనా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని వినియోగదారుల మండలి రాష్ట్ర అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి తహశీల్దార్ జగన్మోహన్ రెడ్డి కి విన్నవించారు. సర్వే నెంబర్ 584/1 లో 2008 నుండి మైనింగ్ జరుగుతున్న క్రమంలో, అక్కడి ఉన్న గుట్ట అతి పెద్ద "బిలం" మారిపోయి స్థానిక గ్రామ ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు



ఏర్పడే పరిస్థితులను అధికారులు క్షుణ్ణంగా పర్యవేక్షణ చేయాలని మండలి ప్రతినిధులుఈ రోజు దివి 27-1-2024 న వినియోగదారుల మండలి రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి, సంయుక్త కార్యదర్శి నల్లా రాజేందర్ లు ఆత్మకూరు తహశీల్దార్ జగన్మోహన్ రెడ్డిని కలవడం జరిగింది. ఆత్మకూరు మండలం పెద్దాపురం గ్రామంలో రెవెన్యూ శాఖ యొక్క లేకుండా మైనింగ్ సంస్థలు బ్లాక్ గ్రనేట్ ను తీస్తున్నాయని, మైనింగ్ రూల్స్ 1966 మరియు రెవెన్యూ డిపార్ట్మెంట్ జి.వో.నెం 4 తేది 19-1-2015 ల ప్రకారం ఆయా ప్రాంతాల తహశీల్దార్ లు అనుమతులు తీసుకున్న తర్వాత నే మైనింగ్ శాఖ లైసెన్స్ లు ఇస్తాయని, కాని పెద్దాపురం మైనింగ్ సంబంధించి దొరకడం లేదని అధికారులు చెపుతున్నారని ఫిర్యాదు చేయడం జరిగింది. సర్వే నెంబర్ 584/1 లో రెండు మైనింగ్ సంస్థలు మైనింగ్ శాఖ చేసుకున్న అగ్రిమెంట్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని, ఇప్పటికే రెండు సంస్థలు పర్యావరణ నిబంధనలు అతిక్రమించి నందున న్యాయ స్థానాలు జరిమానా విధించాయని, లోకాయుక్త లో విచారణ జరుపుతున్నదని, అయినా కూడా నిబంధనల ప్రకారం మైనింగ్ నిర్వహించక పోవడం పై రెవెన్యూ శాఖ ఇకనైనా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని వినియోగదారుల మండలి రాష్ట్ర అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి తహశీల్దార్ జగన్మోహన్ రెడ్డి కి విన్నవించారు. సర్వే నెంబర్ 584/1 లో 2008 నుండి మైనింగ్ జరుగుతున్న క్రమంలో, అక్కడి ఉన్న గుట్ట అతి పెద్ద "బిలం" మారిపోయి స్థానిక గ్రామ ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు ఏర్పడే పరిస్థితులను అధికారులు క్షుణ్ణంగా పర్యవేక్షణ చేయాలని మండలి ప్రతినిధులు సూచించడం జరిగింది. అనంతరం ధరణీ పోర్టల్ కు సంబంధించిన ఫిర్యాదులను తహశీల్దార్‌కు ఇవ్వడం జరిగింది.

## నెల్లూరుకి చేరుకున్న షర్మిల రెడ్డి కి గజమాలతో ఆహ్వానం పిసిసి ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రెడ్డి

**పిసిడబ్ల్యూ న్యూస్/నెల్లూరు జిల్లా:** రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు షర్మిలరెడ్డి ఈ సందర్భంగా కోవూరు జాతీయ రహదారి వద్ద హోటల్ నెల్లూరు గ్రాండ్ సమీపంలో ఘనంగా గజమాలతో ఆహ్వానించారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి చేవూరు శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసినటువంటి డాక్టర్ స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి ముద్దు బిడ్డ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు యువ నాయకురాలు మొట్టమొదటిసారిగా నెల్లూరు నగరానికి విచ్చేయు శుభ సందర్భంలో నెల్లూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చేవూరు దేవకుమార్ రెడ్డి ఇందిరా భవనంలో అత్యంత సమావేశం నిర్వహిస్తుంటే ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి దౌర్భాగ్యపు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన మంది మార్బలంతో అధికార దుర్వినియోగం చేసి మున్సిపల్ కమిషనర్ దినేష్ కుమార్ ఐఏఎస్ ని ప్రలోభం పెట్టి ఏర్పాటు చేసినటువంటి ఫ్లెక్సీలు స్వాగత



తోరణాలు ఎంతో ప్రేమగా ఎంతో అభిమానంగా కార్యకర్తలు నాయకులు ఏర్పాటు చేసుకుంటే సింహపురి నగరం అంతా షర్మిలమ్మకు స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తే వాటిని అధికారాన్ని ఉపయోగించి పాడు చేయడం స్వయంగా మున్సిపల్ అధికారుల కమిషనర్ పర్యవేక్షణలో అన్యాయం చేయడం చాలా బాధాకరం దీన్ని కాంగ్రెస్ పార్టీ తరపున ఖండిస్తున్నాం ఎంతోకాలం ఈ విధంగా మీరు నియంత పాలన సాగించలేరు చరిత్ర తిరగేస్తే నియంతలు కాలగర్భంలో కలిసిపోయారు ఇటీవల తెలంగాణలో జరిగిన ఎన్నికలలో కెసిఆర్ అనే నియంతకు ప్రజలు గుణపాఠం చెప్పారు జగన్మోహన్ రెడ్డి మీ నియంత పాలన ను ప్రజారాంధితంగా పాలన చేయకుండా ఈ విధంగా నియంత పాలన చేస్తే ప్రజలు ఒప్పుకునే పరిస్థితిలో లేరు 40 రోజుల్లో ప్రజలు తీర్పు చెప్పబోతున్నారు ఇంటికి పోవడం ఖాయం కాంగ్రెస్ పార్టీ బాధ్యతలు చేపట్టిన షర్మిలా రెడ్డి ని చూసి వెన్నులో వణుకు పుట్టింది. కాంగ్రెస్ కేంద్రంలో రాష్ట్రంలో అధికారంలోకి రాబోతు ంది ప్రజలు తీర్పు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిల్లా అధ్యక్షులు చేవూరు దేవ కుమార్ రెడ్డి ,నాయకులు, కార్యకర్తలు, తదితరులు, పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు నగదుతో పాటు తులం బంగారం



**పిసిడబ్ల్యూ న్యూస్/హైదరాబాద్:** కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు నగదుతో పాటు తులం బంగారం ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించాలని? 53 ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖలపై సమీక్ష నిర్వహించిన సీఎం.. పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్రంలోని ప్రతి లోక్సభ నియోజకవర్గంలో బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటుపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ హాస్టళ్లకు గ్రీన్ ఛానెల్ ద్వారా నిధులు విడుదల చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించేందుకు స్థలాలు గుర్తించి, అంచనాలు తయారు చేయాలన్నారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సమీక్షలో పాల్గొన్నారు.

## ఉద్యోగాల భర్తీ రీషెడ్యూల్!

**- రూపకల్పన చేస్తున్న టీఎసపీఎస్సీ**

**- వివరాలను వెల్లడించేందుకు కసరత్తు**

**- చైర్మన్‌గా మహేందర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ**

**- మరో ముగ్గురు సభ్యులు కూడా..**

**పిసిడబ్ల్యూ న్యూస్/హైదరాబాద్:** వివిధ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు విడుదలై పలు దశల్లో నిలిచిపోయిన నియామక ప్రక్రియను రీషెడ్యూల్ చేయాలని టీఎస్‌పీఎస్సీ భావిస్తోంది. త్వరలోనే ఈ రీ-షెడ్యూల్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించాలని నిర్ణయించింది. టీఎసపీఎస్సీ నూతన చైర్మన్‌గా నియమితులైన మహేందర్‌రెడ్డి, సభ్యులు అనితా రాజేంద్ర, ఎన్.యాదయ్య, రజనీ కుమారి శుక్రవారం తమ బాధ్యతలను స్వీకరించారు. అనంతరం ఉద్యోగాల భర్తీకి సంబంధించి అనుసరించాల్సిన విధానంపై చర్చించినట్లు సమాచారం. నిలిచిపోయిన ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వీలైనంత త్వరగా ప్రారంభించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. అయితే.. ఈ ఉద్యోగాల నియామకాలకు సంబంధించి పూర్తి స్థాయి



షెడ్యూల్‌ను ఖరారు చేయాలని భావిస్తున్నారు. పలు పోస్టుల భర్తీ ప్రక్రియ వివిధ దశలో నిలిచిపోయిన విషయం తెలిసిందే. కొన్ని పోస్టులకు సంబంధించిన పరీక్షలను పూర్తిచేయగా, మరికొన్ని పోస్టులకు సంబంధించి ఇంకా పరీక్షలను నిర్వహించలేదు. పరీక్షలను నిర్వహించిన పోస్టులు, ఇంకా పరీక్షలను నిర్వహించలేని పోస్టులను వేర్వేరు కేటగిరీలుగా భావించి, ఈ షెడ్యూల్‌ను రూపొందించాలని భావిస్తున్నారు. అంటే.. ఇప్పటికే ఆయా పోస్టుల భర్తీకోసం జారీ చేసిన నోటిఫికేషన్లకు సంబంధించి రీ-షెడ్యూల్‌ను జారీ చేయనున్నారు. ఒకవేళ ఆయా గ్రూపు పోస్టుల్లో ఉద్యోగాల సంఖ్యను పెంచాలని భావిస్తే.. అనుబంధ నోటి ఫికేషన్లను కూడా జారీ చేయాల్సి ఉంటుంది. దీనిపై ప్రభుత్వ ఉద్దేశం ప్రకారం కమిషన్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. సుమారు 8,039 గ్రూపు-4 పోస్టుల భర్తీ కోసం కోసం బోర్డు ఇప్పటికే పరీక్షలను నిర్వహించిన సంగతి తెలిసిందే. 7,62,872 మంది అభ్యర్థులు పరీక్షలను రాయగా.. తుది కీని కూడా విడుదల చేశారు. ఈ ఫలితాల వెల్లడిపై కూడా కమిషన్ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.